

ఎమ్మెల్యే బలాలకు సమస్యలను విన్నవిస్తున్న కాలనీవాసులు

కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు

చాదర్‌ఘాట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీలోని ఇళ్లకు సరఫరా అవుతున్న కలుషిత నీటి నివారణకు తక్షణమే చర్యలు చేపడుతున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. మంగళవారం ఆయన లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, గంగుల వెంకటేశ్వర్‌రెడ్డి, లచ్చయ్య, జి.గంగాధర్‌రెడ్డి, యాదయ్యతో కూడిన బృందం చేసిన ఫిర్యాదు మేరకు స్పందించి కాలనీలో పర్యటించారు. కాలనీలో కొన్ని ఇళ్లకు కలుషిత నీటి కారణంగా తాగునీటి సరఫరాను నిలిపివేశారని, దీంతో తాము తీవ్ర నీటి ఎద్దడికి గురవుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. కలుషిత నీరు ఎక్కడ జరుగుతుందో గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో నూతన సివరేజీ పైప్‌లైన్‌ను అది కూడా 8 అంగుళాలకు బదులుగా 12 అంగుళాల పైప్‌లైన్ నిర్మించాలని ఆయన జలమండలి ముసారాంబాగ్ సెక్షన్ మేనేజర్ చందునాయక్‌కు సూచించారు. అదేవిధంగా తాగునీటి సరఫరాను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శాలివాహననగర్ కాలనీ పార్క్‌ను సందర్శించి తక్షణమే చెట్ల కొమ్మల నివారణకు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ యూబీడీ మేనేజర్ యమునకు సూచించారు. జేస్తే కాలనీపార్క్ అభివృద్ధికి మరిన్ని నిధులను కేటాయిస్తానన్నారు. శాలివాహన మల్టీస్పెషాల్టీ ముందు వరద నీరు నిలవకుండా, తక్షణమే రోడ్డు ఎత్తు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బొక్క మధుసూదన్‌రెడ్డి, కాలనీవాసులు రాంరెడ్డి, విజయ్‌కుమార్, కమలాకర్‌రెడ్డి, శంకర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

చాదర్‌ఘాట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేసి నిరుపేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాడపంగి నాగరాజు మాట్లాడుతూ ఏడాదికి 4లక్షల మంది విద్యార్థులు స్కాలర్ షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటుండగా, వీరికి ఏడాదికి రూ.3వేల కోట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకులు యశ్వంత్, గణేష్, శ్రీనిధి, పూజ, వాణి, లత తదితరులు పాల్గొన్నారు.

పీఅండ్ టీ కాలనీ రామాలయం పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

దిల్‌సుఖ్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పీ అండ్ టీకాలనీ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా ఏడుగురు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఛైర్మన్‌గా బి.నాగరాజు, సభ్యులుగా శాంతి, శశికళ, శంకర్‌రావు, జయశంకర్‌రెడ్డి, సుజాతలక్ష్మి, గుండా జయమ్మ బాధ్యతలు చేపట్టారు. గడ్డిఅన్నారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దుల వేణుగోపాల్‌యాదవ్ నూతన పాలకవర్గ సభ్యులను సత్కరించి, అభినందనలు తెలిపారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన కమిటీని మంగళవారం ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్లో జరిగిని ఎన్నికల్లో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా శీలంరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.సాయివర్మ, కోశాధికారిగా టీ.రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా లచ్చగారి వెంకటేష్, మల్లెల బాలకిషన్, సహాయ కార్యదర్శిగా కె.రవికుమార్ ఎన్నికయారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఫొటో, వీడియోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు ఎలక్షన్ కమిటీగా వ్యవహరించిన సోమిరెడ్డి, ముత్యాల సంజీవ, వెంకటేష్, యస్.బీ.ఎన్ చారి, అనంత రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు.

వనస్థలిపురం లయన్స్‌క్లబ్ నూతన కమిటీ..

వనస్థలిపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మనోహర్ రెడ్డి, డిస్ట్రిక్ ఫస్ట్ వైస్ గవర్నర్ గంపా నాగేశ్వర్ రావు, కమలాకర్, శ్యామ్ ఆధ్వర్యంలో వనస్థలిపురం లయన్స్ క్లబ్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా విట్టా దూరయ్య ప్రధాన కార్యదర్శిగా ఎస్‌జేఎస్.నందకిషోర్, కోశాధికారిగా ఏ.మల్లికార్జున్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 21న నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీ అధ్యక్షుడి ఎన్నిక

చంపాపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీసంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గోదల శ్రీనివాస్‌రెడ్డి 43 ఓట్ల మెజారిటీతో ఎన్నికయ్యారు. కాలనీ సంక్షేమసంఘం గోదల శ్రీనివాస్‌రెడ్డి ప్యానల్‌లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో కాలనీ అధ్యక్షుడిగా గోదల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా జి.పర్వత్‌కుమార్‌యాదవ్, కోశాధికారిగా ఎస్.కొండల్‌రెడ్డి, జయింట్ సెక్రటరీలుగా జగదీశ్వర్‌రెడ్డి, భరత్, సాంస్కృతిక కార్యదర్శిగా తులసీనాయక్ ఎన్నికయ్యారు.

కలుషిత నీటి నివారణకు చర్యలు : కార్పొరేటర్

దిల్‌సుఖ్‌నగర్: మంచినీటి పైపులైన్‌లలో కలుషిత నీటి నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి జలమండలి జీఎం బలరామ రాజుకు విన్నవించారు. డివిజన్ పరిధిలో మంచినీటి పైపులైన్ల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. నూతన పైపులైన్‌ల నిర్మాణం, మరమ్మతులకు నిధులు కేటాయించాలని మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సరిత తదితరులు పాల్గొన్నారు.

గృహకార్మికుల కోసం సమగ్ర చట్టం తీసుకురావాలి

వనస్థలిపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం అమల్లోకి తీసుకురావాలని తెలంగాణ గృహ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వనస్థలిపురం డివిజన్ ఎన్జీవోస్ కాలనీలో తెలంగాణ గృహ కార్మికుల దినోత్సవాన్ని యూనియన్ రంగారెడ్డి జిల్లా కో-ఆర్డినేటర్ మాధురి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంజుల మాట్లాడుతూ గృహకార్మికులు బతుకుదెరువు కోసం ఇళ్లలో పనిచేస్తూ కుటుంబ భారాన్ని మోస్తూ దుర్భర జీవనం సాగిస్తున్నారన్నారు. తెలంగాణలో ఉన్న 11లక్షల మంది గృహ కార్మికుల హక్కుల సాధనకు యూనియన్ కృషి చేస్తోందన్నారు. తమ హక్కుల సాధనకు త్రిసభ్య కమిటీ కమిటీ వేసి సంక్షేమ బోర్డును ఏర్పాటు చెయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్స్‌తో కూడిన ప్లకార్డులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లేబర్‌లైన్ కోఆర్డినేటర్ స్వర్ణ, ఎంఎస్‌ఐ డైరెక్టర్ బ్రదర్‌వర్గీస్, రాష్ట్ర కోఆర్డినేటర్లు శోభ, లూర్దు మేరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సౌదీ కరెన్సీ ఇస్తానంటూ రూ.5.8 లక్షల మోసం

కొత్త పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సౌదీ కరెన్సీ ఇస్తానంటూ నమ్మించి రూ. 5.8లక్షలను తీసుకుని, తెల్లకాగితాలున్న బ్యాగు అందజేసి మోసగాళ్లు పరారయ్యారు. ఈ ఘటనలు ఎల్బీనగర్, ఘట్‌కేసర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. పోలీసుల కథనంప్రకారం... మౌలాలీ శాదుల్లనగర్‌కు చెందిన మహ్మద్ దస్తగిరి చర్లపల్లి వెల్డింగు దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 12న గుర్తు తెలియని వ్యక్తి దుకాణం వద్దకు వచ్చి తన వద్ద సౌదీ కరెన్సీ ఉందని ఇండియన్ కరెన్సీ కావాలన్నాడు. ఒక సౌదీ కరెన్సీ నోటు అతడికి ఇచ్చాడు. చార్మినార్ వద్ద కొందరికి చూపిస్తే అది అసలైన సౌదీ కరెన్సీ నోటు అని తేలడంతో మహ్మద్ దస్తగిరి ఇండియన్ కరెన్సీ ఇచ్చేందుకు అంగీకరించాడు. అతడు కామినేని చౌరస్తా -సీరీస్‌రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తికి రూ.2.80 లక్షలు ఇచ్చాడు. గుర్తు తెలియని వ్యక్తి అతడికి ఓ బ్యాగు అందజేసి 10నిమిషాల తర్వాత చూడమన్నాడు. తర్వాత బ్యాగులో నోట్ల కట్టల లాగా తెల్లకాగితాలున్న కట్టలు ఉండడం చూసి, మోసపోయానని గుర్తించాడు. ఈ మేరకు ఎల్బీనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అబ్దుల్ హమీద్ అనే వ్యక్తి తనకు ఆ మోసగాడిని పరిచయం చేశాడని పోలీసులకు తెలిపాడు. అదే విధంగా ఘట్‌కేసర్ మండలం నారపల్లికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్ బిల్డింగ్ లిఫ్ట్ పనులు చేస్తుంటాడు. ఈనెల 10న అతడి పరిచయస్తుడు సక్లయిన్ అక్కడి బావర్చి హోటల్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తిని పరిచయం చేసి, సౌదీకరెన్సీ నోట్లు ఉన్నాయని, ఇండియన్ కరెన్సీనోట్లు కావాలనిచెప్పారు. వాటిని మారిస్తే పెద్ద మొత్తంలో డబ్బు సొంతం చేసుకోవచ్చని సక్లయిన్ నమ్మించాడు. ఈ నెల 14న కామినేని చౌరస్తా సమీపంలోని భరత్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఇర్ఫాన్ తన వద్ద ఉన్న రూ.3లక్షలను సక్లయిన్ సమక్షంలో మోసగాడికి అందజేశాడు. బదులుగా మోసగాడు అతడికి ఓ బ్యాగు ఇచ్చి, 5 నిమిషాల తర్వాత చూడాలని వెళ్లిపోయాడు. తర్వాత బ్యాగులో తెల్లకాగితాల కట్టలు ఉన్నాయి. ఈ మేరకు ఇర్ఫాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

అడుగంటిన ప్రజాస్వామ్య విలువలు

కాంగ్రెస్ నాయకులు కనీసం ప్రొటోకాల్ పాటించరా? : బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ప్రధానకార్యదర్శి అరవింద్‌శర్మ, లక్ష్మీనర్సింహారెడ్డి, రాంరెడ్డి, అర్జున్, తదితరులు

ఎల్బీనగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య విలువలు అడుగంటిపోయాయని బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బడంగ్‌పేట బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ సూరకంటి అర్జున్ అన్నారు. మంగళవారం ఆర్‌కే పురంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఖిల్లా మైసమ్మ ఆలయంలో సోమవారం జరిగిన బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్‌ను పాటించకుండా వ్యవహరించడాన్ని తప్పుపట్టారు. అయిదు సార్లు ఎమ్మెల్యేగా, మూడు సార్లు మంత్రిగా సేవలందించిన సబితా ఇంద్రారెడ్డిని కాంగ్రెస్ నాయకులు అవమానించారని వారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలైన కిచ్చెనగారి లక్ష్మారెడ్డిని ప్రొటోకాల్‌కు విరుద్ధంగా ప్రభుత్వ కార్యక్రమంలో వేదికపైకి పిలిచి చెక్కులు పంపిణీ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజాపాలన అంటూ కాంగ్రెస్ నాయకులు తెచ్చిన మార్పు ఇదేనా అని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కరూ సంతృప్తిగా లేరన్నారు. అనునిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్న సబితా ఇంద్రారెడ్డిపై కాంగ్రెస్ నాయకులు అవాకులు చవాకులు పేల్చితే ఊరుకునేదిలేదని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో బడంగ్‌పేట్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఉద్యమకారుల కన్వీనర్ న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల అరవింద్‌కుమార్, కొండ్ర శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

బోనాల చెక్కుల పంపిణీ

ఎల్బీనగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని దేవాలయ కమిటీలకు ప్రభుత్వం అందజేస్తున్న చెక్కులను మంగళవారం ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అందజేశారు. ఎల్బీనగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి చిన్నారెడ్డి ఆలయ కమిటీల ప్రతినిధులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, చింతల అరుణ సురేందర్‌యాదవ్, కళ్లెం నవజీవన్‌రెడ్డి, పవన్‌కుమార్, బానోతు సుజాతనాయక్, మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, పీసీసీ మాజీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రామ్మోహన్‌గౌడ్, మంజులారెడ్డి, నరసింహాయాదవ్, సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సుల పేరుతో మామూళ్ల డిమాండ్

ఏసీబీని ఆశ్రయించినా ఫలితం శూన్యం



అభిరామ్



సుభాషిణి

చాదర్‌ఘాట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ట్రేడ్ లైసెన్సులపై చిరువ్యాపారులకు అవగాహన లేకపోవడం జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 సిబ్బందికి వరంగా మారింది. మామూళ్లకు అలవాటుపడిన సిబ్బంది తీరుపై విసిగిపోయిన దిల్‌సుఖ్‌నగర్‌లోని గాయత్రి స్టడీహాల్ నిర్వాహకుడు అభిరామ్, హాస్టల్ నిర్వాహకురాలు సుభాషిణి ఏసీబీని ఆశ్రయిస్తే తక్కువ అమౌంట్ ఉన్నందున తాము ఏమీ చేయలేమని ఏసీబీ అధికారులు చేతులెత్తేసిన తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అభిరామ్, సుభాషిణి మీడియాను ఆశ్రయించి తనగోడు వెళ్లబోసుకున్నారు. హాస్టల్‌కు వచ్చిన ముగ్గురు జీహెచ్‌ఎంసీ సిబ్బంది ట్రేడ్ లైసెన్సు చూపమన్నారని, లైసెన్సు చూపితే దీన్ని రెన్యూవల్ చేయించుకోవాలని సూచిస్తూనే రూ.15వేలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారని నిర్వాహకురాలు సుభాషిణి తెలిపారు. అందుకు తాను నిరాకరిస్తే నోటీసులు ఇస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. లైసెన్సు జారీ చేసిన అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతానంటే వారంతా రిటైర్డ్ అయ్యారని, అడిగినంత డబ్బులు ఇవ్వాల్సిందేనని చెప్పారని వివరించారు. వ్యాపారులకు అవగాహన కల్పించి 24 గంటల్లో లైసెన్సు మంజూరు చేయాల్సిన సిబ్బందే మామూళ్లకు అలవాటుపడి రాష్ట్ర ఖజానాకు గండికొడుతున్నారని అభిరామ్, సుభాషిణి వివరించారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా సిబ్బందికే వత్తాసు పలుకుతున్నారని బాధిత వ్యాపారులు వాపోయారు.

మా భూములను హార్డ్‌వేర్ పార్క్ నుంచి తొలగించండి

టీజీఐఐసీ ఛైర్మన్‌కు బాధిత రైతుల జేఏసీ వినతి



నిర్మలారెడ్డిని కలిసిన హార్డ్‌వేర్ పార్క్ బాధిత రైతుల జేఏసీ ప్రతినిధులు

సరూర్‌నగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): తమ భూములను హార్డ్‌వేర్ పార్క్ నుంచి తొలగించి తమ కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల నుంచి దూరం చేయాలని హార్డ్‌వేర్ పార్క్ బాధిత రైతుల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం వారు టీజీఐఐసీ ఛైర్మన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తుర్కయాంజాల్(ఎంఎం.కుంట), ఇబ్రహీంపట్నం మండలంలోని ఆదిబట్ల తదితర గ్రామాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములను హార్డ్‌వేర్ పార్క్ నిమిత్తం సేకరించడానికి దాదాపు 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నోటీసులు జారీ చేసిందని వివరించారు. అప్పటి నుంచి భూములను తీసుకోకుండా, రైతులకు నష్ట పరిహారం ఇవ్వకుండా నాన్చుతున్నారని, రైతుల అభిప్రాయాలు తీసుకోకుండానే రెవెన్యూ రికార్డుల్లోనూ మార్పులు చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో రైతులు తమ ఆర్థిక అవసరాల కోసం భూములను అమ్ముకోలేకపోతున్నారని వివరించారు. తమ భూములను హార్డ్‌వేర్ పార్క్ జీవో నుంచి తొలగించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు మాధవరం రామేశ్వరరావు, దార సత్యం, కందాడి శ్రీరాంరెడ్డి, ముద్దం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్లానింగ్ కమిటీ వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డిని సైతం కలిసి వినతి పత్రం అందజేశారు.



నాదర్‌గుల్‌లో అంగన్‌వాడీ చిన్నారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మేయర్ పారిజాతారెడ్డి

నాదర్‌గుల్‌లో 'అమ్మ మాట- అంగన్‌వాడీ బాట'

సరూర్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ 9వ డివిజన్ పరిధిలో గల అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు నిర్వహించిన ర్యాలీని కార్పొరేటర్లు నిమ్మల సునీతశ్రీకాంత్‌గౌడ్, తీగల శ్రీధర్‌రెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి, ఉపాధ్యాయులు, ఆయాల వేతనాలను పెంచడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రొటోకాల్ సెల్ కార్యదర్శి బంగారు బాబు, కాంగ్రెస్ నాయకులు వల్లపు సుభాన్‌యాదవ్, బంగారు అశోక్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సరూర్‌నగర్: బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. 28వ డివిజన్‌లోని మునిసిపల్ భవనం నుంచి మారుతీనగర్ మీదుగా అల్మాస్‌గూడలోని రాజీవ్ గృహకల్ప వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణం పనులను మంగళవారం కార్పొరేటర్లు అర్జున్, ఏనుగు రాంరెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి తదితరులతో కలిసి ఆమె పరిశీలించారు.



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి, 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్

హయత్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తక్షణమే పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి ఉద్యోగులకు ప్రమోషన్లలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డి తుర్కయంజాల్ రొక్కం సత్తిరెడ్డి గార్డెన్‌లో తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలలో బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు, రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. బీసీ ఉద్యోగుల ప్రమోషన్లు, రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ సవరణ బిల్లు పెడతామని చెప్పి ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. నాచియప్పన్ కమిటీ బీసీ ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫారస్సు చేసిందని అన్నారు. బీసీ బిల్లు విషయంలో బీజేపీ తన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీ అయిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉన్నప్పుడే బీసీ బిల్లు పెట్టకపోతే చరిత్ర క్షమించదని అన్నారు. రాష్ట్రంలో బీసీ లెక్కలు తేల్చిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమార స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకన్నగౌడ్, ఎన్‌పీడీసీఎల్ అధ్యక్షుడు సదానంద్, కార్యదర్శి నరేందర్, డిస్కం అధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి చంద్రుడు, నాయకులు ప్రేంకుమార్, సతీష్, సురేందర్, వెంకన్న, శివ, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీమారుతీనగర్ సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే సబితారెడ్డికి స్థానికుల వినతి



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అర్జున్, నరేశ్ తదితరులు

సరూర్‌నగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ 28వ డివిజన్‌లోని శ్రీమారుతీనగర్ కాలనీవాసులు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం కౌన్సిల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ సూర్లగంటి అర్జున్ ఆధ్వర్యంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.నరేశ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీలో 11 రోడ్లు ఉన్నాయని, వాటిలో ఒక్కటి కూడా బీటీగా గానీ, సీసీగా గానీ అభివృద్ధి చేయలేదని, ఆ దిశలో చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీకి తాగునీటి సరఫరాకు సంబంధించిన మెయిన్ పైపులైన్ పనులు పూర్తయినప్పటికీ అంతర్గత లైన్‌పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సైతం పూర్తిచేసి నీటి సరఫరా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉన్నదని, సెప్టిక్ ట్యాంకులే దిక్కుగా మారాయని, అవి నిండి మురుగు నీరు మొత్తం రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధం వస్తోందని విన్నవించారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేసి పనులు మొదలయ్యేలా చూడాలని కోరారు. సబితారెడ్డి స్పందిస్తూ మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

నేడు మొహర్రం.. భారీ బందోబస్తు

చాదర్‌ఘాట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నేడు మొహర్రం పండుగ సందర్భంగా బీబీకా ఆలం ఊరేగింపు ముగిసే ప్రాంతమైన చాదర్‌ఘాట్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావులేకుండా 300 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం మలక్‌పేట-నల్గొండ చౌరస్తాలోని మలక్‌పేట ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీబీకా ఆలం ఊరేగింపులో అడుగడుగునా పోలీసుల గస్తీ ఉంటుందన్నారు. అపరిచిత వ్యక్తులు, వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 300 మంది, మలక్‌పేట పీఎస్ పరిధిలో మరో 50 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. అడిషనల్ డీసీపీ స్వామి, రాజు, మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, సుదర్శన్, రవీందర్, మల్లారెడ్డి డబీర్‌పుర, మలక్‌పేట, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్లు శ్రీను, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ అండ్ సేల్ మేళా

వనస్థలిపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్ శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్, లక్నో చికెన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్, ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటుచేసిన హస్త కళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చెసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ ప్రదర్శన ప్రతి రోజూ ఉదయం 10.30ల నుంచి రాత్రి 9వరకు అందుబాటులో ఉంటుందని అక్బర్‌అలీ పేర్కొన్నారు.

కట్టమైసమ్మను దర్శించుకున్న భాస్కర్‌రెడ్డి

ఎల్బీనగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలలో భాగంగా సరూర్‌నగర్ కట్ట మైసమ్మ దేవాలయాన్ని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి మంగళవారం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, సీఐ సైదిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ బోయిని మహేందర్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, బేర బాలకిషన్, ప్రధానకార్యదర్శి ఇమ్రాన్‌అలీ, కళ్యాణ్‌యాదవ్, నబి, సంతోష్, చిన్నయాదవ్, మహిళా అధ్యక్షురాలు అరుణ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌ఎంపీ పనులను నాణ్యతగా చేపట్టాలి

చంపాపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ డీఎంఆర్‌ఎల్ చౌరస్తా సమీపంలోని పోచమ్మగడ్డబస్తీని మంగళవారం కార్పొరేటర్ సుజాతనాయక్ సందర్శించారు. బస్తీలో సీఆర్‌ఎంపీ నిధులు రూ.15లక్షలతో కొనసాగుతున్న డ్రైనేజీ, వరదనీటి నివారణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పైపులైన్ నిర్మాణ పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ హేమునాయక్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, మమత మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

సంతోష్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని చార్మినార్ జోనల్ అడిషనల్ ట్రాఫిక్ ఇన్‌చార్జి ఎస్.లక్ష్మణ్ విద్యార్థులకు సూచించారు. ఐఎస్‌సదన్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్కూల్ లీడర్స్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలన్నారు. పాఠశాల స్థాయిలోనే ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటిని చేరే వరకు నిరంతరం కృషి, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులతో ప్రమాణం చేయించి వారికి బ్యాడ్జిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ వెంకటప్ప, ప్రిన్సిపాల్ పరిమళతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగులకొట్టి భారీచోరీ

- 30 తులాల బంగారు, కిలో వెండి ఆభరణాల అపహరణ
- పరిశీలించిన ఏసీపీ, ● వివరాలు సేకరించిన క్లూస్‌టీం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు పగులకొట్టి గుర్తు తెలియని దొంగలు ఇంట్లోని 30 తులాల బంగారు, 1 కిలో వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తారామతిపేట గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ శివారు తారామతిపేటకు చెందిన ఏపూరి మధుచారి గోల్డ్‌స్మిత్ పనులు చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం ఇంటికి తాళంవేసి అతడి తల్లిని నాగోల్‌లోని సోదరి వద్ద వదిలిపెట్టాడు. కుమారుడికి జ్వరం వచ్చిందని మధుచారి భార్య ఫోన్ చేయడంతో బోయిన్‌పల్లిలోని అత్తగారింటికి వెళ్లాడు. మంగళవారం సాయంత్రం గేటు, డోర్ తెరిచి ఉండడంతో ఇంటి పక్కన వాళ్లు మధుచారికి సమాచారం అందించారు. ఇంటికి వచ్చిన అతడు లోపలికి వెళ్లి చూడగా అల్మారాలోని దుస్తులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. అందులోని 30 తులాల బంగారు, 1 కిలో వెండి ఆభరణాలు కనిపించలేదు. వెంటనే అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి ఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. 5 ఏళ్ల క్రితం కూడా ఇదే ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మదర్సా విద్యార్థి అదృశ్యం



మహ్మద్ అరీఫ్(ఫైల్)

సైదాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మదర్సా విద్యార్థి అదృశ్యం కావడంతో స్కూల్ నిర్వాహకులు సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహ్మద్ అరీఫ్(11) సైదాబాద్ ఉజలేషా లోని మదర్సా అలీ-హక్ ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్నాడు. సోమవారం రాత్రి మదర్సా నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతడి ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. దీంతో నిర్వాహకులు సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client Sri Shaik Chand Basha S/o Shaik Silarsab R/o,Raghuram Nagar, Hydersha kote,had entered into Agreement of Sale by paying advance sale consideration for the **D.No.6-58/103, PTIN No.1260300810,Flat No 103,First Floor,Sri Raghuram Apartments, Raghuramnagar, Hydershakote**,with built up area of 750 Sft Inculding common area & Carparking together with undivided share of land admeasuring 30 Square yards or equivalent to 25.08 square meters,(out of 1624 Sq.Yards) the building named SRI RAGHURAM APARTMENTS on Plot No. 7,8, 9/Part, 27 & 28 in Survey No. 18/1, 18/2, 18/3, Situated at Raghuram Nagar now under Bandlaguda Jagir Municipal Corporation, Gandipet Mandal, Ranga Reddy District, Telangana State from **Sri Mohammad Kaleem Ahemad , R/o 17-1-262/A/1, Mama Bakhtawarhatt, Santhosh Nagar Colony, Hyderabad, Telangana-500059.**

If any person/s having any interest and objection or claim in respect of the above said property, may approach the undersigned within (7) days from the date of this notice failing which my client shall proceed with the sale transaction and thereafter no objections will be entertained.

P.RAVI,Advocate,
Hyderabad.
8985404545,8619536795

ఆంధ్రజ్యోతి ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి రాజు : 99854 02786